

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం


ఈ నెల 15వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజన్ స్థాయిలోనూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

మేల్కోకుంటే రబీకి నీటి కష్టాలే..!

ఆక్రమణలతో బక్క చిక్కిన పంట బోదెలు - పూడికతీత చేపట్టాలని కోరుతున్న రైతులు



భీమలాపురంలో గుర్రపు డెక్కతో నిండిపోయిన పంట కాలువ



ఆచంట వేమవరంలో పూర్తిగా పూడుకుపోయిన పంట బోదె

ప్రజాశక్తి - ఆచంట

సాగునీటి కోసం రైతులు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. పంట కాల్వల ద్వారా రైతులకు సకాలంలో సక్రమంగా సాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా ఉంటున్నాయి. కాలువల్లో గుర్రపు డెక్క, తూడు, చెత్తాచెదారం పేరుకుపోయి సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి ఉంది. కొన్ని సంవత్సరాలుగా రైతులు సాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. ఆయకట్టు శివారు ప్రాంతాల్లో రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఖరీఫ్ ప్రారంభంలో ఎదురైన నీటి కష్టాలతో మేల్కొన్న అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టారు. ప్రధాన కాల్వల సమస్య ఒకింత తీరినా, ప్రస్తుతం ఉపకాల్వలు, బోదెలు ఆక్రమణలతో బక్కచిక్కి పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ సాగుకు ఏదోలా తంటాలు పడిన రైతులు రబీలో మాత్రం బోదెల ద్వారా నీరందకపోతే కనీసం దమ్ములు చేసుకునే పరిస్థితి ఉండదని వాపోతున్నారు. శివారు భూములకు నీరందించే బోదెల తవ్వకం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తక్షణం పనులు చేపడితే రబీలో నీటి కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉందని చెబుతున్నారు.

నియోజకవర్గంలో సుమారు 48 వేల ఎకరాల్లో రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నాలుగు మండలాల పరిధిలోని ఆయకట్టుకు బ్యాంక్ కెనాల్, నర్సాపురం కాల్వ, జెఎన్‌వి ఛానల్, రాపాక ఛానల్ ద్వారా సాగునీరు అందుతుంది. ఈ కాల్వల పరిధిలో సుమారు 85 ఉప కాల్వలు, 270 శివారు పంట కాల్వలు, 500కుపైగా పంట బోదెల్లో నీరు ప్రవహిస్తోంది. ఉప కాల్వలో శివారు పంట బోదెల్లో మూడు వంతులకుపైగా ఆక్రమణలతో బక్కచిక్కిపోయాయి. దీంతో పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాల్లో తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడింది.

ఆచంట మండలంలో కొడమంచిలి, వల్లూరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, శేషమ్మ చెరువు, పెదమల్లం, ఆచంట వేమవరం గ్రామాల పరిధిలో అధికంగా పంట బోదెలు, ఉపకాల్వలు ఆక్రమణలతో నిండిపోయాయి. బ్యాంకు కెనాల్, ఉప కెనాల్స్‌పై అధికారుల అజమాయిషీ కొరవడడంతో పలుచోట్ల ఆక్రమణలు పేరుకుపోయాయి. దీంతో ఆయా గ్రామ పరిధిలోని శివారు భూములకు నీరు చేరడం కష్టంగా మారింది. వల్లూరు, దేవ, ఆచంట-2 ఛానల్, కందరవల్లి, భీమలాపురం ఛానల్, కొరాలపర్రు ఛానల్, జగ్గరాజు ఛానల్, ఇల్లపర్రు ఛానల్, పోర కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు ప్రతియేటా రబీలో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు ముందుగా మేల్కొని గడిచిన రబీలో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు వేడుకుంటున్నారు. రబీలో సాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి.

రబీలో సాగునీటి సమస్య తీవ్రం..

కొండేటి రామకృష్ణ, కౌలురైతు, ఆచంట వేమవరం



ప్రధానంగా దాళ్వా సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉంటున్నాయి. పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, మేట వేసి ఉండటంతో కాల్వల్లోని నీరు ఆయిల్ ఇంజిన్లకూ అందని పరిస్థితి. దీంతో ప్రధానంగా కాలువల్లో తూడు పెరిగిపోయి ఉండటమే. ఫలితంగా డీజిల్ వంటి ఖర్చులు ఎక్కువ కావడంతో పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. తక్షణమే అధికారులు, నీటిసంఘాల నాయకులు స్పందించి ఈ

పంట బోదెల్లో తూడు తొలగించాలి

ఆచంట నాగేశ్వరరావు, కౌలురైతు, ఆచంట



కాలువల్లో తూడు, ఇతర చెత్త చెదారంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. పంట కాల్వలు, బోదెల్లో తూడు తొలగించాలి. ముఖ్యంగా శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. దీంతో రబీ సీజన్‌లో ప్రతియేటా సాగునీటి కష్టాలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం.

సాగు లేకపోతే చావే శరణ్యం

మంత్రి పార్థసారధి వద్ద కొల్లేరు రైతుల కన్నీరు

ఈ ప్రభుత్వంలోనే సమస్య వచ్చిందని ఆవేదన

తోకలపల్లి సమాశానికి వేలాది మంది రైతులు

అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడతానని మంత్రి హామీ

రెండు, మూడు రోజుల్లో నిర్ణయం చెబుతామని వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, నిడమర్రు

కొల్లేరును ఆనుకుని ఉన్న భూముల్లో రబీసాగుకు అవకాశం ఇవ్వకపోతే చావు తప్ప వేరే మార్గం లేదని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి వద్ద కొల్లేరు రైతులు కన్నీరుమున్నీరయ్యారు. నిడమర్రు మండలం పత్తేపురంలో ఆదివారం పేదల ఇళ్ల కాలనీని మంత్రి కొలుసు పార్థసారధి ప్రారంభించారు. ఆయనతోపాటు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కొల్లేరు సాగుకు సంబంధించిన విషయంలో తోకలపల్లిలో కమ్యూనిటీ హాలు వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మండలంలోని అడవికొలను, గోపవరం, పెదనింద్రకొలను, ఆముదాలపల్లి, బైనేపల్లితోపాటు కొల్లేరు గ్రామాల నుంచి వేలాది మంది రైతులు తరలొచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షులు సైదు నాగరాజు, మాజీ సర్పంచి ఘంటసాల ఆదినారాయణ, గ్రామంలోని రైతులు వెంకటస్వామి తదితరులు మాట్లాడారు. వందల ఏళ్ల నుంచి కొల్లేరులో సంప్రదాయ వ్యవసాయ సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. ఇప్పటి వరకూ తమను ఏ ప్రభుత్వమూ ఇబ్బంది పెట్టలేదని, ఈ ప్రభుత్వ హయాంలోనే తమకు ఇబ్బంది వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచి ఆదినారాయణ మాట్లాడుతూ ఈ భూములే తమకు జీవనాధారమని, సాగు చేయకపోతే చావుతప్ప వేరే మార్గం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. తరతరాల నుంచి ఇక్కడ వ్యవసాయం చేస్తున్నామని రైతులంతా మంత్రికి తెలిపారు. ఇప్పటికే సరైన ఉపాధి లేక కొల్లేరు గ్రామాల ప్రజలు వందల కిలోమీటర్లు వలస వెళ్లి ప్రమాదాలకు గురై ప్రాణాలు వదులుతున్నారన్నారు. ఇప్పుడు సాగు నిలిపివేస్తే ఉన్న ఉపాధి సైతం దెబ్బతిని రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు గ్రామాల ప్రజల బతుకుదెరువు అంతా ఈ భూములపైనే ఆధారపడి ఉందని రైతులంతా తెలిపారు. జనసేన నేత వెంకటలక్ష్మి, పత్తికోళ్లలంకకు చెందిన మహాలక్ష్మిరాజు కొల్లేరు రైతుల ఇబ్బందులను మంత్రికి వివరించారు. రైతులతో మాట్లాడిన అనంతరం మంత్రి పార్థసారధి మాట్లాడుతూ అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో కొల్లేరును ఆనుకుని ఉన్న వ్యవసాయ సాగుపై మాట్లాడతామని, రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని చెప్పారు. రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని మంత్రి అటవీశాఖ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. వ్యవసాయానికి సమయం ఆసన్నమైందని, తాము భూముల్లోకి వెళ్తామని రైతులు చెప్పారు. మంత్రి నుంచి తమకు స్పష్టమైన హామీ వస్తుందని ఎదురు చూశామని, అయితే పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వకపోవడం రైతుల్లో నిరాశ నింపింది. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ కొల్లేరు రైతుల గురించి నిరంతరం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతున్నామన్నారు. రైతులకు కచ్చితంగా న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.



ఇబ్బందులను వివరిస్తున్న కొల్లేరు రైతు

రైతు బజార్లలో నాణ్యతేదీ..!

- నాణ్యత లేని లేని కూరగాయల విక్రయం
- ఏలూరు పత్తేబాద్, వన్‌టౌన్ రైతుబజార్లలో వినియోగదారులు గగ్గోలు
- ఉల్లి, టమోటా నాణ్యత మరింత దారుణం
- రైతు బజార్లలో కానరాని రైతులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ





రైతు బజార్‌లో విక్రయిస్తున్న నాణ్యతలేని ఉల్లి, టమాటాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుబజార్లలో నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. నాసిరకం కూరగాయలతో రైతుబజార్లను నింపేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. తక్కువ ధరకు ఇస్తున్నామనే సాకుతో దెబ్బతిన్న కూరగాయలు, ఉల్లిపాయలు, టమోటాలు పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ అనేది పూర్తిగా లేకుండాపోయింది. ఏలూరు జిల్లాలో నాలుగు రైతు బజార్లు ఉన్నాయి. వీటిలో ఏలూరు పత్తేబాద్‌లోని, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రైతు బజార్లకు వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆదివారమైతే పెద్దఎత్తున జనం రైతుబజార్లకు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తారు. ఉల్లిపాయలు కిలో రూ.28కు విక్రయిస్తున్నా కనీస నాణ్యత లేని పరిస్థితి ఉంది. టమాటా కిలో రూ.38 తీసుకుంటున్నా.. మచ్చలున్న, దెబ్బతిన్న వాటిని విక్రయిస్తున్నారు. కిలో టమోటాలు మంచివి కావాలంటే 15 నిముషాలు ఏరితే తప్ప దొరకని పరిస్థితి ఉంది. క్యారెట్ సైతం తాజా సరుకు అమ్మకుండా నిల్వ సరుకు అమ్ముతున్నా పట్టించుకునేవారే లేకపోయారు. ఏలూరు నగరంలోని అత్యధిక జనాభా పత్తేబాద్ రైతుబజార్‌లోనూ కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. అయినప్పటికీ అక్కడ నాణ్యతకు సంబంధించి పరిశీలించే పరిస్థితి లేదు. వినియోగదారులు నాణ్యతపై వ్యాపారులను ప్రశ్నిస్తే ధర తక్కువగా ఉండేలా సరుకు కొనుగోలు చేయాలని అధికారులు చెబుతున్నారని అంటున్నారు. బహిరంగ మార్కెట్‌కు, రైతుబజార్లకు కూరగాయల ధరల్లో పెద్దగా తేడా కన్పించడం లేదు. రైతుబజార్లలో మాత్రం ఎటువంటి నాణ్యతా లేని కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ రైతుబజార్లలో పెద్దఎత్తున వ్యాపారం సాగుతోంది. జనం పెద్దఎత్తున వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నా.. సరైన చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. మునగ, కొబ్బరికాయల ధరలు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నా పట్టించుకోని పరిస్థితి. ఒక్క మునగకాయ రూ.25కు విక్రయించడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. రైతుల నుంచి రూ.పదికి కొనుగోలు చేస్తున్న కొబ్బరికాయ రూ.20కుపైనే విక్రయిస్తున్నారు. అత్యంత ముఖ్యమైన జనం పెద్దఎత్తున కొనుగోలు చేసే ఉల్లి, టమోటా విషయంలోనూ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. చిక్కుడు అసలు ఏమాత్రం నాణ్యత ఉండటం లేదు. ధరలు అత్యధికంగా చెల్లిస్తున్నా సరుకు నాణ్యత లేకపోవడంపై వినయోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేస్తే నాణ్యత లేకపోవడంతో రెండురోజులకే క ు ళ్లి పో తు న్నా య ు ని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం రైతుబజార్లు ఏర్పాటు చేసిన లక్ష్యానికి, క్షేత్రస్థాయి పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది.

రైతుల నుంచి కొనుగోలే లేదు..!

ప్రభుత్వం రైతుబజార్లు ఏర్పాటు చేసినప్పుడు చెప్పిన మాటలకు.. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితికీ ఏమాత్రం సంబంధం లేదు. రైతుబజార్లలో కూరగాయలు విక్రయించేవారిలో రైతులు టార్చి పెట్టి వెతికినా కన్పించరు. రైతుల నుంచి నేరుగా కూరగాయలు కొనుగోలు చేయడం వంటి ప్రక్రియ ఇక్కడ లేదు. వన్‌టౌన్ పెద్దమార్కెట్‌లో దళారుల నుంచి కూరగాయలు కొనుగోలు చేసి రైతుబజార్లలో విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. నాణ్యత తగ్గిన సరుకును రైతుకు అతితక్కువ ధర చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అదే సరుకును ఎక్కువ ధరకు రైతుబజార్లలో వినియోగదారులకు అంటగడుతున్నారు. కూరగాయల నాణ్యత విషయంలో అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తెలియని పరిస్థితి ఉంది. రైతుబజార్లలో కూరగాయల నాణ్యతపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు పితాని శంకుస్థాపన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎన్నికల్లో ఏదైతే చెప్పిందో, అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం అదే చేస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలో పలుచోట్ల రూ.6.20 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఓడూరులో డ్రెయినేజీ, వాటర్ వర్క్స్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పిహెచ్‌సి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కోసం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బ్రాహ్మణ చెరువు-పొలమూరు-నౌడూరు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వీరవాసరం జెడ్‌పిటిసి గూండా జయ ప్రకాష్, వీరవాసరం ఎంపిపి వీరవల్లి భవాని చంద్రశేఖర్, నీటిసంఘం అధ్యక్షులు ఇందుకూరి నరసింహారాజు, సొసైటీ డైరెక్టర్ కడలి ఏడుకొండలు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు కర్రి అచ్యుతరామరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, టిడిపి మండలాధ్యక్షులు వెలగల బుల్లిరామిరెడ్డి, తహశీల్దార్ వై.రవికుమార్, ఆర్అండ్‌బి డిఇ విజయలక్ష్మి, ఎఇలు ప్రసాద్, యశ్వంత్, తేజస్విని, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ఏటిగట్టును పట్టించుకోని జగన్ ప్రభుత్వం

మంత్రి నిమ్మల రామానాయుడు

రూ.8.93 కోట్లతో ఏటిగట్టు పటిష్ట పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి ఐదేళ్ల అరాచక పాలనలో గోదావరి ఏటిగట్టును పట్టించుకోలేదని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం చించినాడలో రూ.8.93 కోట్లతో గోదావరి ఏటిగట్టు పనులకు కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో గోదావరి ఏటిగట్టు పనులకు రూ.17 కోట్లు నిధులు తీసుకొచ్చానని, ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో బూరుగుపల్లి వద్ద ఏటిగట్టు ప్రమాదకరంగా ఉంటే రూ.ఆరు కోట్లు తీసుకొచ్చి గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో గోదావరికి వరదలు వచ్చినప్పుడు పరివాహక గ్రామానికి చెందిన వేలాది మంది యువతతో కలిసి గోదావరి ఏటిగట్టుకు గండి పడకుండా రాత్రింబవళ్లు కాపలా కాసి కాపాడుకున్నామన్నారు. ఆనాడు మంత్రులు వచ్చి వెళ్లారేగాని, ఒక్క రూపాయి నిధులూ ఇవ్వలేదన్నారు. చించినాడ ఏటిగట్టు కింద 70 సంవత్సరాల క్రితం దళితులకు ఇచ్చిన భూముల్లో మట్టిని వైసిపి నాయకులు కొల్లగొడితే 15 రోజులపాటు దళితులతో కలిసి పోరాటంలో పాల్గొన్నానని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళితుల భూములను ఆన్‌లైన్ చేసి విద్యుత్ సౌకర్యంతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పించి పటిష్టం చేశామన్నారు. కార్యక్రమంలో చించినాడ సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణరాజు, సర్పంచి రాజామణి, ఎంపిపి ధనలక్ష్మి, కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల కబర్ధి, కొడవటి వరబాబు, బోనం నాని, ఆరిమిల్లి చిన్ని, బొప్పన హరికిషోర్, కడలి గోపి, పీతల శ్రీనివాస్, తాళ్ల నాగరాజు, రుద్రరాజు పెద్దవర్మ, చినవర్మ, ప్రసాద్ వర్మ, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, వినుకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చించినాడ బ్రిడ్జిపై ఫెన్సింగ్ వేయండి

ప్రజల ప్రాణాలను కాపాడండి - మంత్రి నిమ్మలకు సిపిఎం వినతి



మంత్రి నిమ్మలకు వినతి పత్రాన్ని అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడలో వశిష్ట గోదావరిపై వంతెనకు ఇరువైపులా ఫుట్‌పాత్‌కు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని సిపిఎం నేతలు మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. ఆదివారం ఏటిగట్టు పటిష్ట పనులకు శంకుస్థాపన చేసేందుకు చించినాడ విచ్చేసిన మంత్రికి ఈ మేరకు సిపిఎం నేతలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ గోదావరిపై వంతెన నిర్మించి సుమారు 25 సంవత్సరాలవుతుందని, నాటి నుంచి ఇప్పటి వరకూ వంతెనపై నుండి కొన్ని వందల మంది గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలు తీవ్రంగా కలిచి వేస్తున్నాయన్నారు. ఈ ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వం బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌కు ఇరువైపులా ఇనుప కంచెను ఏర్పాటు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, మల్లుల పుల్లారావు, ముమ్మిడివరపు ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి, కోరం వెంకటేశ్వరరావు, తెన్నేటి శివాజీ, కేతా వాసు, దొంగ రాంబాబు పాల్గొన్నారు.

సాబ్జీ ఆశయ సాధనకు కృషి

సతీమణి షేక్ సుభాని బేగం - యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న షేక్ బేగం

ప్రజాశక్తి - పాలకొల్లు

సాబ్జీ ఆశయాల సాధనకు ఆయన బాటలో పయనిస్తామని సాబ్జీ సతీమణి షేక్ సుభాని బేగం చెప్పారు. మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక వైష్ణవి హైస్కూల్లో ఆదివారం యుటిఎఫ్ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు సాబ్జీ వర్ధంతి సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో స్థానిక ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.రమేష్, డాక్టర్ కె.ఉమాదేవి పాల్గొని ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ సాబ్జీ చిరస్మరణీయులని, ఉపాధ్యాయ సమస్యలతోపాటు ప్రజా సమస్యపైనా తన గళం విన్పించారని గుర్తు చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన యలమంచిలి మండల శాఖను అభినందించారు. కార్యక్రమంలో సాబ్జీ కుమారుడు షేక్ అబ్దుల్ కలాం ఆజాద్, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.జయప్రభ, జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్, యలమంచిలి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తినాయుడు, పూర్వపు సీనియర్ నాయకులు గోపాలకృష్ణ గోఖలె, దేవ సుధాకర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

10,798 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌లో 10,798 కేసులు పరిష్కారమయ్యాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లా వ్యాప్తంగా 34 బెంచీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 10,351 క్రిమినల్ కేసులు, 153 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 294 సివిల్ కేసులను రాజీ చేశారని, వీటితోపాటు 238 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వీటిలో ఏలూరులో 1988, భీమవరంలో 974, చింతలపూడిలో 1248, జంగారెడ్డిగూడెంలో 971, కొవ్వూరులో 1092, నర్సాపురంలో 434, పాలకొల్లులో 458, తాడేపల్లిగూడెంలో 1433, తణుకులో 1082, నిడదవోలులో 919, భీమడోలులో 153 పెండింగ్ కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

ఆదిత్య ఇఎంఐ స్కూలుకు బెస్ట్ లీడర్స్ అవార్డు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక ఆదిత్య స్కూల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ కృష్ణరాజు హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన టాప్-20 ఆంధ్రప్రదేశ్ బెస్ట్ స్కూల్ లీడర్స్ అవార్డు ఫంక్షన్‌లో బ్రెయిన్ ఫీడ్ ఛైర్మన్ బ్రహ్మం చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు ఆ స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎక్సలెన్స్ ఇన్ ఇన్నోవిటీ టీచింగ్ ప్రాక్టీసెస్, ఎక్స్‌వేన్స్, ఇనిస్పిరేషన్ లీడర్‌షిప్ విద్యారంగంలో విశేషాలు అనుభవం కలిగిన వారికి ఇచ్చే అవార్డు తమ స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజుకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డు తమకు ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తాయని కృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు బి.యువసుధ, కెవి.సత్యనారాయణ, దుర్గాంబ, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కృష్ణంరాజు

సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కేంద్రమైన భీమవరంలో విస్సాకోడేరు వంతెన వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ వరకూ సోలార్ ప్యానల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ కళావేదిక పార్కులో కూడా సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ నెల 20న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ రానున్న దృష్ట్యా ఆయన చేతుల మీదుగా సోలార్ లైట్లు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జెసి వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రారెడ్డి, ఎలక్ట్రికల్ ఇఇ వెంకటేశ్వరరావు, భారతీయ విద్యాభవన్స్, తిరుమల స్కూల్ యాజమాన్యం ఉన్నారు.

22,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఇరగవరం: ఖరీఫ్ సీజన్లో మండలంలో 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకూ 22,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మండల వ్యవసాయ అధికారి వై.రాఘవేంద్రరావు అన్నారు. 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కోత కోసి, ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారని తెలిపారు మొత్తం 13,600 ఎకరాల ఆయకట్టులో వరిసాగు చేశారని, దీనిలో కత్తవపాడు 300 ఎకరాలు, కాకిలేరులో మరో 500 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట కోత కోయాల్సి ఉందని వివరించారు.

గ్రంథాలయంలో 'ఉయ్ లవ్ రీడింగ్'

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉయ్ లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వైవి.సాయిబాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కె.కొండలరావు పుస్తకాల ఎగ్జిబిషన్, విద్యార్థులకు పుస్తకాల గురించి వివరాలు తెలుపుతూ కథల రూపంలో వివరించారు. గరికపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ డే ప్రాముఖ్యత, ఇంధన వనరులు ఉత్పత్తి ఇంధన పొదుపు ఆవశ్యకత పౌరుల బాధ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, వి.లక్ష్మణరావు, ఎ.జనార్దన్, కెవి.సత్యప్రకాష్, వి.రామాంజనేయులు, బాపూజీ రావు, కొండలరావు, పాఠకులు పాల్గొన్నారు.

సేవల్లో గణపవరం లయన్స్‌కు ప్రథమ స్థానం

గణపవరం: ప్రజలకు సేవలందించడంలో గణపవరం లయన్స్ క్లబ్ జిల్లాలో మొదటి స్థానం సాధించిందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు తెలిపారు. లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ రావూరి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయత సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు ఏడాది కాలంలో అధిక సంఖ్యలో ప్రజలకు సేవలందించడం హర్షించ తగ్గ విషయమన్నారు. క్లబ్ చేసిన సేవలకు జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ నాయకులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ లయన్స్ కుటుంబ సభ్యులు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం లయన్స్ క్లబ్ నాయకులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, పోశెంశెట్టి రామ్మూర్తి, కెఎస్ఎన్.మూర్తి, వి.పంచముఖి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాలకవర్గ సభ్యులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

బాలోత్సవంలో మెండి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాళ్ల



బహుమతి అందుకుంటున్న మెండి పాఠశాల విద్యార్థిని

ఈ నెల 12, 13వ తేదీల్లో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన బాలోత్సవంలో మండలంలోని మెండి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నలుగురు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. కె.తేజస్వీ డ్రాయింగ్ విభాగంలో ప్రథమ బహుమతి, పి.దివ్యకుమారి క్లేమాల్డింగ్ విభాగంలో ప్రథమ బహుమతి, కె.లక్ష్మీప్రసన్న పద్యం భావం విభాగంలో ద్వితీయ బహమతి, పి.దివ్యకుమారి మమరీటెస్ట్ విభాగంలో ద్వితీయ బహమతి సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శిక్షణ ఇచ్చిన ప్రధానోపాధ్యాయులు పవన్‌కుమార్, ఉపాధ్యాయిని జి.ప్రశాంతిని మండల విద్యాశాఖాధికారులు డి.శ్రీనివాసరావు, పాలా యేసుదాసు, గ్రామ సర్పంచి తానింకి నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ఐక్యత : కొత్తపల్లి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం కొండేటి వారి తోటలో ఆదివారం జరిగిన తెలగ, కాపు ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. మొగల్తూరు, నరసాపురం మండలాల నుంచి కాపు సోదరులు పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు. పిల్లలు ఆటపాటలు, మహిళలకు మ్యూజికల్ ఛైర్స్ వంటి ఆటలతో సందడి చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా కాపు కార్పొరేషన్ ఛైర్మన్ సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకీరామ్, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న విచ్చేశారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఐక్యత మరింత పెరుగుతుందన్నారు. కష్ట సుఖాలను తెలుసుకుని ఒకరికొకరు సాయం చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. అనంతరం ఎంసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చినమిల్లి సత్యనారాయణ, కోటిపల్లి సురేష్, గుగ్గిలపు మురళీ, వన్నెంరెడ్డి శ్రీను, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, కావలి నాని, చెన్నా రమేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

సేవాగుణం కలిగి ఉండాలి

భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సురేష్

భీమవరం : ప్రతి ఒక్కరూ ఎదుటివారి పట్ల సేవాగుణం కలిగి ఉండాలని భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ అన్నారు. పెన్నాడలో భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా హార్ట్ ఫుల్ నెస్ జిల్లా కోఆర్డినేటర్ స్వామి యోగా, మెడిటేషన్ వల్ల జరిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేశ్ మాట్లాడుతూ ఇటువంటి క్యాంపులు ఉపయోగించుకుని విద్యార్థులు తమ సేవాగుణంతో తోటి వారికి ఉపయోగ పడాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎబిఎస్ఆర్.మనోహర్, డీన్ కురెళ్ల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు 5జి సెల్‌ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రవ్యాప్తంగా 58,204 మంది అంగన్వాడీ కార్యకర్తలకు 5జి సెల్‌ఫోన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు వెచ్చించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆదివారం రాత్రి పాలకొల్లు నియోజకవర్గంలో అంగన్వాడీలకు 5జి ఫోన్లు ఆయన పంపిణీ చేశారు. సేవల వేగం, పారదర్శకత కోసం స్మార్ట్ టెక్నాలజీని అంగన్వాడీ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు.


జువ్వలపాలెం వంతెనపై ఆగిపోయిన లారీని తోస్తున్న ప్రజలు


ఉండి : శిథిలావస్థకు చేరిన కాపులపేట వంతెన

శిథిలావస్థలో వంతెనలు..!

బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

అన్నయ్య కోడు పంట కాలువపై జువ్వలపాలెం గ్రామం వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. పదేళ్ల క్రితమే ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. అయినా ఈ వంతెన పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రయాణికులు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ఈ వంతెనపైనే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఈ వంతెనపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఇటు గుండా ప్రయాణం నరకప్రాయంగా మారింది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. భీమవరం నుంచి జువ్వలపాలెం వరకూ ప్రధాన రహదారి మార్గంలో ఉన్న ఈ వంతెనపై నిరంతరం విజయవాడ వంటి ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులు, లారీలు, ఆటోలు ప్రయాణిస్తూ ఉంటాయి. పలు వాహనాలు తరచూ ఈ ప్రాంతంలో ఆగిపోతున్నాయి. వాహనం ముందుకు వెళ్లాలంటే పలువురి సాయంతో తోయాల్సి వస్తోంది. ఏలూరుపాడు, కాళ్లకూరు, కాళ్ల, దొడ్డనపూడి వంటి గ్రామాల ప్రజలు జువ్వలపాలెం రావడానికి ఇదే ప్రధాన మార్గం. అయితే వంతెన శిథిలావస్థకు చేరడంతో ఏ సమయంలో ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనపై ఉన్న గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ వంతెనపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రమాదం జరగక ముందే నూతన వంతెన నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉండి : సుమారు 600 ఎకరాల వరి పొలాలకు, ఆక్వా చెరువులకు వెళ్లేందుకు చెరుకువాడ కాపులపేట వద్ద ఉండి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరడమే కాకుండా ఒకవైపు రైలింగ్ మొత్తం ఊడిపోయింది. దీంతో ఈ వంతెనపై ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. ఆక్వా చెరువులకు, పంట పొలాలకు రైతులు తెల్లవారుజామున, అర్ధరాత్రి వేళల్లో అజాగ్రత్తగా వెళ్లినట్లయితే ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించి ఈ వంతెనకు మరమ్మతులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడకుండానే విజేతల ప్రకటన..!

పలువురు విమర్శలు

ప్రజాశక్తి - వీరవాసరం


వీరవాసరంలో ఫైనల్లో ఆడుతున్న పశ్చిమ, విజయనగరం జిల్లా టీంలు

వీరవాసరం కేంద్రంగా జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్ - 17 బాల బాలికల అంతర జిల్లాల రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీలు జరిగిన తీరు స్థానికులను విస్మయానికి గురిచేశాయి. బాలుర, బాలికలు రెండు విభాగాల్లో పశ్చిమగోదావరి, విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో బాలికలకు, పాటిటెక్నిక్ కళాశాల వేదికగా బాలురకు ఫైనల్ పోటీలు నిర్వహించారు. బాలికల ఫైనల్ పోటీల్లో మొదటిసారి పశ్చిమ జట్టు బ్యాటింగ్ చేస్తుండగా పావు గంట ఆట జరిగిన తరువాత పోటీని అర్ధాంతరంగా ముగించేసి విజయనగరం జిల్లా జట్టు విజయం సాధించినట్లుగా ప్రకటించారు. దీంతో పోటీలు తిలకించడానికి వచ్చిన స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. పశ్చిగోదావరి జట్టుకు మద్దతుగా స్థానికులు, విద్యార్థులు పోటీలు జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. పోటీ పూర్తవ్వకముందే విజేతను ప్రకటించడంతో క్రీడా నిర్వాహకుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగానే విజేతలను నిర్ణయించినప్పుడు పోటీలు నిర్వహించడం దేనికంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా బాలుర ఫైనల్ పోటీలో కూడా పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజేతను ముందుగా నిర్ణయించారన్న ఆరోపణలు విజయనగరం జిల్లాకు చెందిన ఒక క్రీడాకారుడు ప్రజాశక్తితో తెలిపాడు. పశ్చిమ తుది జట్టులో జిల్లాకు సంబంధం లేని కొంతమంది ప్రతిభ గల క్రీడాకారులను తుది జట్టులో ప్రవేశపెట్టినట్టు తెలిపాడు. ముందుగానే పశ్చిమ జట్టును విజేతగా నిర్ణయించినట్టు తమకు సమాచారం ఇవ్వడంతో పూర్తి సామర్థ్యంతో ఆడలేదని ఆ క్రీడాకారుడు తెలిపాడు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎపిలో విద్యార్థుల కోసం వార్షిక క్రీడా పోటీలుగా వీటిని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, నైపుణ్యం అభివృద్ధి, ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడం, ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి ఈ స్కూల్ గేమ్స్ పోటీల ముఖ్యోద్దేశం. మండల స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ ఈ పోటీలు జరుగుతాయి. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల ద్వారా ప్రతిభా వంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయిలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించే విధంగా క్రీడాకారులను ఎంపిక చేస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన క్రీడల్లో విజేతలను ముందుగా నిర్ణయించడమనేది ఏ నిబంధనల మేరకు జరిగిందో నిర్వాహకులే చెప్పాల్సి ఉంది. వివిధ స్థాయిల్లో జరిగిన పోటీల్లో ఎపి తరపున జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ప్రతిభ గల క్రీడాకారులను విరివిరిగా ముందుగా గుర్తించినప్పటికీ జిల్లా జట్టుగా పాల్గొనే ఫైనల్ పోటీల్లో విజేతలను ముందుగా నిర్ణయించడంపై సహచర క్రీడాకారులపై ఏ ప్రభావం పడుతుందో, ఈ క్రీడల ఉద్దేశం ఏంటన్నది నిర్వాహకులు విస్మరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇది క్రీడా స్ఫూర్తికి పూర్తి విరుద్ధమన్న తీవ్ర విమర్శలు నిర్వాహకులపై వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ పోటీల పరిశీలనకు వచ్చిన వారు ఏం చెబుతారో వేచి చూడాల్సి ఉంది.

ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు

అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మికి ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం టౌన్


చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి

మనం చేస్తున్న పనిని నిజాయతీ, నిబద్ధతతో చేసుకుంటూ పోతే గుర్తింపు దానంతట అదే వస్తుందని పలువురు చెబుతుంటారు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సిహెచ్.మహాలక్ష్మికి జనవరి 26న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రం నుంచి ఐదుగురు అంగన్వాడీ టీచర్లకు ఆహ్వానం అందింది. పశ్చిమగోదావరి జిల్లా నుండి తనకు ఈ అరుదైన అవకాశం దక్కిందని మహాలక్ష్మి తెలిపారు. రెండు రోజుల క్రితం తనకు తమ శాఖ డైరెక్టర్ నుంచి సమాచారం వచ్చిందన్నారు. అయితే సెంటర్ వద్ద నలుగురికి స్ఫూర్తినిచ్చే విధంగా ఆమె ఆకుకూరలు, కూరగాయలు మొక్కలు పెంచుతున్నారు. అంతేకాకుండా జీరో ప్లాస్టిక్ విధానంతో స్కూల్ నిర్వహించడంతో అధికారులు, ప్రజా ప్రతినిధుల అభినందనలు పొందుతున్నారు. గత అక్టోబర్‌లో ఆమెకు స్వచ్ఛంద అవార్డు లభించింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ నాగరాణి, కేంద్ర సహాయ మంత్రి భూపతి శ్రీనివాస్‌వర్మ, ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే 2016, 2017లోనూ, 2020లో ఉత్తమ అవార్డు పురస్కారాలు అందుకున్నారు. 2025 ప్రస్తుతం ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు వెళ్లే అవకాశం రావడంతో ఆమెతోపాటు ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

హోలీ ఏంజెల్స్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - ఆచంట



అవార్డు అందుకుంటున్న హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ రవికుమార్

దేశ వ్యాప్తంగా విద్యా రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న సంస్థలకు ప్రకటించే జాతీయ విద్యా అవార్డును మండలంలోని కొడమంచిలి గ్రామానికి చెందిన హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కుక్కల రవికుమార్ అందుకున్నారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి చెందిన ఒక ప్రయివేట్ సంస్థ నిర్వాహకులు కెవి.బ్రహ్మం రవికుమార్‌కు ఈ అవార్డు అందజేశారు. ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం చేపట్టిన కొత్త కార్యక్రమాలు, విద్యా సంస్థలో బోధన నాణ్యత, విద్యార్థుల ప్రతిభ, ఆధునిక విద్యా పద్ధతులు, క్రమశిక్షణతో కూడిన విద్య, మంచి వాతావరణం వంటి అనేక ప్రమాణాలను పరిగణలో తీసుకుని ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు తదితరులు పలువురు రవికుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత నాణ్యమైన విద్యనందించే దిశగా నిరంతరం కృషి చేస్తానని, ఈ గుర్తింపుతో బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

ఎస్‌సి శ్మశానవాటిక రహదారి సమస్య పరిష్కరించాలి

తహశీల్దార్‌కు ఎంఎల్ఎ పితాని ఆదేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎస్‌సి శ్మశాన వాటికకు వెళ్లే రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తహశీల్దార్ వై.రవికుమార్‌ను ఆదేశించారు. ఆదివారం ఉదయం పొలమూరు విచ్చేసిన ఆయనకు స్థానిక ఎస్‌సి నేతలు శ్మశాన వాటిక దారి సమస్యను వివరించారు. దీనిపై ఎంఎల్ఎ స్పందిస్తూ శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి శ్మశాన వాటికకు అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు వెలగల బులిరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆలీజిన్నా, టిడిపి గ్రామాధ్యక్షులు పెన్మెత్స వివేక రాఘవేంద్రరాజు, జనసేన గ్రామాధ్యక్షులు తోరం వెంకన్న బాబు, స్థానిక నేత బుంగా రాజశేఖర్, మాజీ ఎంపిటిసి తూటే రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

పేదల ఆరోగ్యానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని వారతిప్ప గ్రామానికి చెందిన వీరవాల్ల అశ్విని కుమార్తె ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఆదివారం అశ్వినీకి రూ.28,400 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును నాయకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యం గురించి ఎంఎల్ఎ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు, కొల్లాటి గోపి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, నలుగురు జనసైనికులు ఉన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపిపాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు తరలొచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు చిన్నారులు ఇసుక తిన్నెలపై ఆటలాడి సందడి చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు.

ఛాంబర్స్‌లో స్కాలర్‌షిప్ టెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ కళాశాలల ఆధ్వర్యంలో ప్రస్తుత 2025 - 26లో పదో తరగతి, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎఎంసి ఛైర్మన్, కాస్మో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కాంప్లెక్స్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు విచ్చేశారు. మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ ఫీజు రాయితీలిస్తూ అత్యున్నత విద్యనందిస్తున్నామని విద్యార్థులు చదువు పూర్తి చేస్తుండగానే మంచి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తూ ఎనలేని సేవ చేస్తున్న విద్యా సంస్థలు ఛాంబర్ అని తెలిపారు. అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ ఏటా మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టుకు హాజరయ్యే వారి సంఖ్య పెరుగుతోందని, నేడు పరీక్షకు 2623 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. సెక్రటరీ కెవి సీతారామరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం, పరీక్షా సామగ్రిని అందజేశారు. కళాశాల అడిషనల్ ఛైర్మన్ తట్టవర్తి కృష్ణమూర్తి, ట్రెజరర్ ప్రవీణ్‌భాను, అకాడమిక్ అడ్వయిజర్స్ ఎబిఎస్.మూర్తి, నందుల సీతారామ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కెవి.నరసింహారావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతలు వీరే..

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జెడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ఆవరణలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్-17 బాల బాలికల పోటీలు దిగ్విజయంగా ముగిశాయి. వివరాలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, దాసరి సునీత ఆదివారం తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఇఒ ఇవివిఎన్ఎస్ఎస్ఎస్ఎల్.నారాయణ, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుద్దటి స్వామీజీ, అబ్జర్వర్ బండారు ప్రసాద్, అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.జయరాజ్, ఫిజికల్ డైరెక్టర్స్ పిటి అసోసియేషన్ కార్యదర్శి ఎండి కుద్దూస్, వీరవాసరం స్కూల్ హెడ్మాస్టర్ జుత్తిగ శ్రీనివాస్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాజింకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర జట్టును కూడా ఎంపిక చేశారు.

అండర్ -17 బాలికల సాఫ్ట్ బాల్ ఫలితాలు..

ప్రథమ స్థానం : విజయనగరం జిల్లా
ద్వితీయ స్థానం : పశ్చిమగోదావరి జిల్లా
తృతీయ స్థానం : తూర్పుగోదావరి జిల్లా


వీరవాసరంలో ట్రోఫీ అందుకుంటున్న పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు

బాలుర అండర్ 17 సాఫ్ట్ బాల్ ఫలితాలు

ప్రథమ స్థానం: పశ్చిమగోదావరి జిల్లా
ద్వితీయ స్థానం: విజయనగరం జిల్లా
తృతీయ స్థానం: శ్రీకాకుళం జిల్లా

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 గంటల నుంచి అందించాలని కోరారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 10 వార్డు జ్యోషులవారి వీధి శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3,840 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ బి.యాదగిరి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జనసేనలోకి చేరికలు

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. వారతిప్ప గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆ పార్టీని వీడి ఆదివారం నాయకర్ సమక్షంలో పెద్ద సింగ్ శ్రీను ఆధ్వర్యంలో సుమారు వంద మంది జనసేన కండువా కప్పుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులు పనిచేయాలని సూచించారు.

20 వరకూ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వాల ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ తాడేపల్లిగూడెం డివిజన్లో రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ కంపెనీ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. స్వయం సహాయక మహిళా బృందాల వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహ ఉపయోగకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించడం, విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అంశంపై నిష్ణాతులచే ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్ షాపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారని తెలిపారు. విద్యుత్ పొదుపుపై అవగాహన కోసం గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయబడునున్నట్లు తెలిపారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈనెల 20వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం - పాలకొల్లు 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం. చిట్టవరం గ్రామంలో సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన పూరిళ్ల రమేష్ (45) తలకు తీవ్ర గాయమైంది. అంబులెన్స్‌లో పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలిస్తుండగా రమేష్ మృతి చెందాడు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై నరసాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.